మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ఫిర్యాదులను పెండింగ్ పెట్టొద్దు : కలెక్టర్ ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 14 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 142 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లకు అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వివిధ అంశాలపై సూచనలు చేశారు. గ్రామ పరిపాలన అధికారుల నియామకానికి ఆసక్తి ఉ న్నవివిధ శాఖలలో పనిచేస్తున్న మాజీ విఆర్ఓలు,వి. అర్ఏలు విఏఓలు వారు ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలియ చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా చేపట్టి వందకు వంద శాతం లక్ష్యాలను సాధించే దిశగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించాలని, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులపై

## ప్రత్యేక దృష్టి పెట్టండి

**జిల్లా అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, జూలై 14 ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను సత్వరమే

## పరిష్కారించాలి



ప్రజావాణిలో పిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్, జూలై 14, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను త్వరగా పరిష్కారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయములోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా లోని వివిధ ప్రాంతాలకు చెందిన 71 మంది తమ సమస్యల పరిష్కరం కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్ర మంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సి ంగ్ రావులతో కలసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు.వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 77 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 14 ప్రభాతవార్త:** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి అమరేందర్ స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (77) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి.అమరేందర్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు రవి కుమార్, శోభా, వెంకట్, నారాయణ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటనకు పూర్తి స్థాయిలో

# పకడ్బందీగా ఏర్పాట్లు

- కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సీఎం సమావేశ పర్యవేక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 14 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన పూర్తి స్థాయిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కొల్లాపూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలలో కలెక్టర్ సంతోష్, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెంటవెల్లి మండలం జటప్రోల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లతో పాటు హెలిప్యాడ్, సభావేదిక, వీఐపీలు, ప్రజలకు సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ బాదావత్ సంతోష్ స్వయంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులతో పాటు ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి ప్రారంబోత్సవాలు, నూతనంగా చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించడంతో పాటు సభ పూర్తయ్యేంత వరకు చేపట్టాల్సిన పనుల గురించి సమన్వయంతో విధులు నిర్వర్తించేలా సూచించినట్లు పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కానున్నందున సభాస్థలి వద్ద ఏర్పాట్లను కూడా సిద్ధం చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నామన్నారు. దీంతో పాటు ముఖ్యమంత్రి వచ్చే సమయంలో హెలిప్యాడ్ ఏర్పాట్లు చేయడంతో పాటు వారికి స్వాగతం పలికే ప్రజాప్రతినిధుల వివరాలను కూడా సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాకను విజయవంతం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, ఎంపీడీవో దేవేందర్, ఎమ్మార్వో విజయ్ సింహ, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గుండెపోటు వచ్చినప్పుడు ప్రాథమిక వైద్యం సిపిఆర్ చేయాలి

### క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్య పరీక్షలు నిర్వహించాలి : జిల్లా కలెక్టర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి, జూలై 14 ప్రభాతవార్త :** గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణం రక్షించేందుకు తక్షణం చేయాల్సిన ప్రాథమిక వైద్యం సి.పి.ఆర్ విధానాన్ని ఏ విధంగా చేయాలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిపిఆర్, క్యాన్సర్, క్షయ, సీజనల్ వ్యాధులు, మధుమేహం, ఆర్‌బిఎస్‌కే పై ప్రోగ్రాం ఆఫీసర్ వారిగా సమీక్ష చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ ఈ మధ్య అకస్మాత్తుగా గుండెపోటుతో అకస్మాత్తుగా ప్రాణాలు పోవడం చూస్తున్నామని దీనిని నివారించేందుకు గుండెపోటు వచ్చిన వారి ప్రాణం రక్షించేందుకు అత్యవసర సమయాల్లో నిర్వహించే సిపిఆర్ విధానాన్ని జిల్లాలో సాధ్యమైనంత ఎక్కువమందికి శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ముందుగా అందరూ జిల్లా అధికారులను, పోలీసు సిబ్బందిని, జిమ్ ట్రైనర్ లను, విద్యా శాఖలో పిఈటిలను, ఆశ వర్కర్లను,ల్యాబ్ టెక్నీషియన్‌లను శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు చేయాలని సూచించారు. జిల్లాలో క్యాన్సర్ వ్యాప్తి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా ప్రణాళికలు చేయాలని సూచించారు. ఆగస్టు 15 నుంచి నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించేందుకు ప్రణాళికలు చేయాలని ఆదేశించారు. మధుమేహం వ్యాధి నిర్మూలన పై సమీక్ష నిర్వహిస్తూ ఇప్పటి వరకు నిర్వహించించిన హెచ్.బి. 1 సి వైద్య పరీక్షల ద్వారా ఎవరికైతే 8 కన్నా ఎక్కువ రైడింగ్ నమోదు అయ్యిందో వారి వద్దకు మెడికల్ అధికారులు స్వయంగా వెళ్లి షుగర్ లెవెల్ పెరిగిపోవడానికి గల కారణాలను తెలుసుకొని వైద్యం అందించాలని సూచించారు. వైద్య పరీక్షలు చేస్తున్న డాటా ఆన్లైన్‌లో ఉంచి అందరూ మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేసేవిధంగా చూడాలని ఆదేశించారు.క్షయ వ్యాధిపై సమీక్ష నిర్వహిస్తూ క్షయ వ్యాధి వల్ల చనిపోయిన 16 మంది చనిపోవడానికి కారణాలు ఏంటి వైద్యం అందిస్తున్నప్పటికీ ఎలా చనిపోయారు అనేది కారణాలు తెలుసుకునేందుకు ఆడిట్ నిర్వహించాలని డిప్యూటీ డి.యం అండ్ హెచ్ఒను ఆదేశించారు. ఆర్.బి.ఎస్. కె ద్వారా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య ప్రామాణిక కార్డు తయారు చేసి ఆన్లైన్ లో నమోదు చేయడంతో పాటు విద్యార్థులకు కార్డు ఇవ్వాలని సూచించారు.పౌష్టికాహార లోపంతో బాధపడుచున్న పిల్లలను ఎన్.ఆర్.సి కేంద్రానికి తీసుకువచ్చి వైద్యం అందించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటిచూపుకు సంబంధించిన క్యాటరాక్ట్ సర్జరీలు చేసేందుకు అవసరమైన వైద్యులు, థియేటర్ అందుబాటులో వచ్చిందని దీనిని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.కంటివెలుగు ద్వారా జిల్లాలో గుర్తించిన క్యాటరాక్ట్ రోగుల జాబితా నుండి రోగులను గుర్తించి వైద్యానికి పంపించే విషాద మెడికల్ ఆఫీసర్లను సూచించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని అందువల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలసంఖ్య పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణుల ఏఎన్‌సి నమోదు సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. జిల్లాలో డెంగ్యూ,మలేరియా,చికెన్‌గునియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పకడ్బందీగా తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్‌వ్యాధులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదు అయితే వెంటనే ప్రభుత్వాసుపత్రికి నివేదిక పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య అధికారి డా.శ్రీనివాస్,డిప్యూటీ వైద్యాధికారి డా.శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి డా.సాయినాథ్‌రెడ్డి, డా. పరిమళ, డా.రియాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### నేడు దిశా కమిటీ

## సమీక్ష సమావేశం

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 14 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జూలై 15న మంగళవారం ఉదయం 10:00 గంటలకు దిశా కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈసమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి అధ్యక్షత వహించనున్నారు.కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరిస్తూ, జిల్లాలో అమలవుతున్న ప్రధాన సంక్షేమ మరియు అభివృద్ధి పథకాలపై సమీక్ష చేయడం, ఈ సమావేశంలో కేంద్ర మరియు రాష్ట్రప్రభుత్వాల వివిధ పథకాలు,వాటి అమలుస్థితి, లబ్ధిదారుల జాబితాలు,నిధులవినియోగం,మరియు అమలులో ఎదురవుతున్న సమస్యలపై చర్చ జరగనుంది. ముఖ్యంగా విద్య,వైద్యం, బ్యాంకింగ్, ఉపాధిహామీ పథకం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి గ్రామసడక్‌యోజన,జాతీయ రహదారులు,ప్రజాపంపిణీ వ్యవస్థ, వివిధశాఖలకు సంబంధించిన కేంద్రమరియు రాష్ట్రప్రభుత్వ పథకాలపై సమీక్ష జరుగుతుంది.ఈ సమావేశానికి సంబంధిత అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులందరూ శాఖలవారీగా పూర్తిస్థాయి ప్రగతి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## తక్షణ న్యాయమే లక్ష్యం

**ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేస్తాం**

**మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి**

**మహబూబ్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** ప్రజావాణి ద్వారా జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో కార్యాలయానికి చేరుకునే వారికి తక్షణ సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 15 ఫిర్యాదులు అందినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా సంప్రదించి, బాధితులకు వేగవంతమైన, న్యాయబద్ధ పరిష్కారాలను సూచిస్తూ తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పౌరుల సమస్యలు ప్రాధాన్యతతో విని, మర్యాదపూర్వకంగా స్పందించడం పోలీసు శాఖ కర్తవ్యం. ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు చేయబడి, పరిష్కార స్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నామన్నారు. అవసరమైతే రంగంలోకి వచ్చి పరిశీలించేందుకు సైతం మా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. బాధితులకు త్వరిత న్యాయం అందించడమే తమ లక్ష్యమన్నారు.

### విద్యార్థులకు పరిమితిలోపు

## ప్రవేశాలు కల్పించాలి

**గద్వాల టౌన్, జూలై 14, ప్రభాతవార్త:** కేజీబీవీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులకు అనుగుణంగానే పరిమితి లోపు ప్రవేశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో కేజీబీవీ పాఠశాలలు , జూనియర్ కళాశాలలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉన్న మౌలిక వసతులు,బోధన, వసతి వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ప్రవేశాలు చేపట్టాలని, అనవసరంగా పరిమితికి మించి అడ్మిషన్లు ఇవ్వడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురికావొచ్చని తెలిపారు.ప్రతి ఒక్క విద్యార్థికి సరైన వసతులు అందించగల సామర్థం ఉన్నపుడే అడ్మిషన్లు ఇవ్వాలని సూచించారు. అనాథలు, తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అడ్మిషన్లు తప్పనిసరిగా జిల్లా విద్యాధికారి ఆమోదంతోనే జరగాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం 7వ,8వ, 9వ తరగతుల్లో పరిమితికి మించి ప్రవేశాలు ఉన్నందున,రాబోయే మూడు సంవత్సరాల పాటు ఆ తరగతుల్లో కొత్త అడ్మిషన్లు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ప్రతి అడ్మిషన్ తర్వాత విద్యార్థి సమాచారం యుడైస్ లో నిర్దిష్ట సమయంలో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని,కేజీబీవీ ప్రిన్సిపల్స్,జిల్లా సమన్వయ అధికారి హంపయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు సిద్ధం కావాలి...

- సమన్వయంతో ముందుకు సాగితేనే గెలుపొందగలం
- కొత్త పాత కాదు అందరూ కాంగ్రెస్ కుటుంబ సభ్యులే
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**అచ్చంపేట, జూలై 14 ప్రభాతవార్త:** జరగనున్న స్థానిక సమరానికి కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం వంగూరు మండల పరిధిలోని కోనేటిపూర్ గ్రామ శివారులో ఉన్న విహెచ్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్థానిక సమరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు కార్యకర్తలతో సమన్వయం పాటించి ముందుకు సాగితేనే గెలుపును చేరుకోగలమని ఆయన కార్యకర్తలకు సూచించారు. గ్రామాలలో నాయకులు కార్యకర్తలతో పని ఏంటని కొంతమంది సమాచారం ఇవ్వకపోవడం వలన సమన్వయ లోపం జరుగుతుందని ఇలా జరిగితే స్థానిక సమరంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని స్థానిక సమరంలో గెలుపు దిశగా ముందడుగు వేయాలంటే నాయకులు ప్రతి కార్యకర్తకు సమాచారం అందించి సమన్వయాన్ని పాటించాల్సిందేనని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి కొత్తగా వచ్చిన నాయకులు గతంలో పనిచేసిన నాయకులు ఇద్దరు వేరు కాదని అందరూ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అని కలిసికట్టుగా పనిచేసి జరగనున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సొంత మండలమైన వంగూరు మండలంలో అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటే మండలం మరింత అభివృద్ధి చెందేందుకు వీలు ఉంటుందని ఆయన అన్నారు. మండల అభివృద్ధికై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే 500 కోట్ల రూపాయలను మంజూరు చేశారని ఇంకో 500 కోట్ల రూపాయలను మంజూరు చేసి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఆయన కార్యకర్తలకు వివరించారు. మండల కేంద్రంలో సమీకృత భవనాలను ఏర్పాటు చేసేందుకుపై అధికారులతో మాట్లాడి 39 కోట్ల రూపాయలను మంజూరు చేయించారని కొండారెడ్డిపల్లి నుండి హాజీపూర్ వరకు నాలుగు లైన్ల రహదారిని ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని మండలానికి ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు నడుస్తున్నాయని ఆయన అన్నారు. ప్రతి కార్యకర్త అధికారం మాదే ఉందని ఎలాగైనా మేము గెలుస్తామని ధీమాతో ఉండకుండా మేము ఓడిపోతామని భయంతో కసితో ఎన్నికలలో పని చేస్తేనే గెలుపును ఆస్వాదించేందుకు సులువుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల ప్రభుత్వంగా ప్రజాపాలన కొనసాగిస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం మొదటి విడతలో రాని లబ్ధిదారులకు రెండో విడతలో అందించి పేదోడి గృహకల్పన కలను సహకారం చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రేషన్ కార్డులు అందరి లబ్ధిదారులకు కార్యకర్తల స్వయంగా వెళ్లి రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను తీసుకొని పేద ప్రజలకు అండగా నిలిచి ప్రజా పాలనకు ఆదర్శంగా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఒక్కో గ్రామానికి చెందిన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి కోసం కార్యకర్తల సలహా మేరకు నిధులను మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాదమని రమేష్ గౌడ్, రంగాపూర్ సింగిల్ విండో చైర్మన్ కుడుముల సురేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు క్యామ మల్లయ్య, జిల్లా నాయకులు వెంకట యాదవ్, నాయకులు అల్వాల్ రెడ్డి, హరీష్ రెడ్డి నారాయణరెడ్డి, రాజశేఖరెడ్డి, పరశురాములు, సతీష్ రెడ్డి, జనార్దన్, యాదగిరిరావు, చంద్రశేఖర్, శేఖర్ ముదిరాజ్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

